

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 7 ఏప్రిల్ 2024





ముసుగు తొలగుతోంది

● అధికార పార్టీ సేవ కోసం
వలంటీర్లతో రాజీనామాలు
● ఎన్నికల్లో గెలుపు కోసం అధికార పార్టీ
మరో హైడ్రామా

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ/వార్డు వలంటీర్ల ముసుగు తొలగిపోతోంది. ఇన్ని రోజులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందించేందుకే అంటూ చెప్పిన కబుర్లన్నీ.. ఉత్తుత్తి కబుర్లుగానే మిగిలిపోనున్నాయి. పైకి ప్రజలకు సేవ అని చెప్పినా.. అసలు సేవ మాత్రం అధికార పార్టీకే అనేది క్రమక్రమంగా బయటపడుతోంది. సాధారణంగా నిబంధనల ప్రకారం ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకుంటున్న ఉద్యోగులు ఎవరైనా సరే.. రాజకీయ పార్టీలకు అనుకూలంగా ప్రచారం చేయకూడదు. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళి కిందకు వస్తుంది. అయితే రాష్ట్రంలో వలంటీర్లు పూర్తి ఏకపక్షంగా అధికారపార్టీ సేవలో కొనసాగుతున్నారు. అధికారపార్టీ తరఫున తమకు కేటాయించిన 50 ఇళ్లలో ప్రచారం చేయడంతో పాటు.. ఓటర్లను ప్రలోభపెట్టే కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు. బహిరంగంగానే అధికార పార్టీ ఇస్తున్న వివిధ రకాల కానుకలను ఓటర్లకు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో వలంటీర్లను ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని ఓ స్వచ్ఛంద సేవా సంస్థ పక్కా ఆధారాలతో సహా కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. దీనిపై స్పందించిన ఎన్నికల సంఘం వలంటీర్లకు ముకుతాడు వేసింది. ఎన్నికలు పూర్తయ్యే వరకు వలంటీర్లు ఎన్నికల విధుల్లో పాల్గొనకూడదని, అదే విధంగా సంక్షేమ పథకాల పంపిణీలో పాల్గొనకూడదని ఆదేశాలు ఇచ్చింది. ఈ సంఘటనతో ఒక్కసారిగా వలంటీర్ల ముసుగు తొలిగి.. అసలు స్వరూపం బయటకు వస్తోంది. పెన్షన్ల పంపిణీలో లబ్ధిదారులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్షాలపై బురద జల్లేందుకు ఎంత యాగీ చేసిందో.. అందరికీ తెలిసిందే. పెన్షన్ల పంపిణీలో తొలుత టీడీపీపైన బురద చల్లేందుకు వలంటీర్లు, ఇటు ప్రభుత్వం కంకణం కట్టుకుంది. అది కూడా అంతగా ఫలితం ఇచ్చినట్లు కనిపించకపోవడంతో.. అధికారపార్టీ వలంటీర్లతో ఇప్పుడు కొత్త డ్రామాకు తెర లేపింది. వలంటీర్లు మూకుమ్మడిగా తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేస్తున్నారు. దీనిపై ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ప్రజలకు సేవ చేయడానికే ఉద్యోగం నిజమైతే.. ఎన్నికల సంఘం ఆదేశాలు గౌరవించాలి కానీ.. ఇలా మూకుమ్మడి రాజీనామాలు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

మూకుమ్మడి రాజీనామాలు ఎవరి కోసం ?

ఇప్పుడు సర్వత్రా జరుగుతున్న చర్చ ఒకటే.. ఇప్పుడు వలంటీర్లు తమ ఉద్యోగాలకు ఎందుకు రాజీనామాలు చేస్తున్నారు. అసలు ఎవరి మేలు కోసం వీళ్లు రాజీనామాలు చేస్తున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం.. ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సైతం ఏదైనా రాజకీయ పార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించకూడదు. అలా కాదని ఎవరైనా చేస్తే.. వాళ్లపైన జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇదే సమయంలో వలంటీర్లు కూడా అధికార పార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సుమారు ఐదారు నెలల కిందటే రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో వ్యక్తుల సమాచారాన్ని సేకరించి ప్రభుత్వానికి ఇచ్చారు. ఇది ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ సంఘటనల నేపథ్యంలోనే.. వలంటీర్లను ఎన్నికల విధులకు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విధులకు దూరంగా ఉంచామని ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చింది. సాక్షాత్తూ... సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లే తమ సైన్యమని, వాళ్లంతా మనవాళ్లేనని, మళ్లీ అధికారంలోకి వస్తే.. మొదటి సంతకం వలంటీర్ల ఫైల్ పైనే అని బహిరంగంగానే పేర్కొంటున్నారు. ఇక మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక నాయకుల సంగతి సరేసరి. ఒకమాటలో చెప్పాలంటే.. ముఖ్యమంత్రి మాటలే.. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అతిక్రమించినట్లుగా ఉంది. ఈ పరిస్థితుల్లో వలంటీర్లు తాము గత 50 నెలలుగా నిస్వార్థంగా సేవలు చేస్తున్నాం.. ఎలాంటి రాజకీయాలకు ప్రభావితం కాకుండా.. సంక్షేమ పథకాల అమలు విధులు నిర్వహిస్తున్నాం.. అయితే పెన్షన్లు పంపిణీ చేయకుండా తమను అడ్డుకోవడం కలిచి వేసిందని అనడాన్ని జనం ఏవిధంగా నమ్ముతారో..? చిలక పలుకులు పలుకుతున్న వలంటీర్లు, వాళ్ల వెనకుండి నడిపిస్తున్న అధికారపార్టీ నాయకులే చెప్పాలి.


చిన్నమండెం ఎంపీడీఓ రామక్రిష్ణకు
రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న వలంటీర్లు

వందల మంది రాజీనామాలు

శనివారం సాయంత్రం వరకు ఉన్న అనధికార సమాచారం మేరకు.. జిల్లాలో వందలాది మంది వలంటీర్లు రాజీనామాలు చేశారు. పెద్దమండెం మండలంలో 27 మంది, మదనపల్లె పట్టణంలో నలుగురు వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేశారు. పీలేరు మండలంలో ఒకరు, కలికిరిలో 32 మంది, కలకడలో 12, గుర్రంకొండలో 42 మంది రాజీనామాలు చేశారు. చిన్నమండెం మండలంలో 35 మంది రాజీనామాలు చేశారు. తమ రాజీనామా పత్రంలో వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేస్తున్నట్లు పేర్కొంటున్నట్లు తెలిసింది.

వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీరును ఏర్పాటు చేసింది. జిల్లాలో మొత్తం 8676 మంది వలంటీర్లు ఉన్నారు. అందులో ప్రస్తుతం 8528 మంది పనిచేస్తున్నారు. సంక్షేమ పథకాల అమలు కోసం వీళ్లను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అయితే రోజులు గడిచే కొద్దీ.. రాష్ట్రంలోని ప్రజలందరి ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంటు నంబర్లు, ఆస్తుల వివరాలు, ఫోన్ నంబర్లు, ఇంటి నంబర్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని సైతం వలంటీర్లు సేకరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ఇదంతా డేటా చౌర్యం కిందకే వస్తుంది. అయినా లెక్క చేయకుండా.. ఈ సమాచారాన్ని సేకరించారు. ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని తమ వద్ద ఉంచుకున్న వలంటీర్లు, ఆ సమాచారాన్ని దుర్వినియోగం చేసే ప్రమాదముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అధికార పార్టీ కూడా అందుకనే వలంటీర్లపైన అంత ప్రేమ చూపుతోందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి 50 ఇళ్లకు ఉండే వలంటీరు ద్వారా తమకు అనుకూలంగా ప్రచారం చేయించుకోవడంతో పాటు.. డబ్బు పంపిణీ, ఇతరా పనులకు వినియోగించుకోవచ్చనే అధికార పార్టీ వలంటీర్లను తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేయమని ఒత్తిడి చేస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. అయితే చాలా మంది తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేయడానికి వెనుకాడుతున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు.. వింటే భవిష్యత్తులో ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందనని వాళ్లు భయపడుతున్నట్లు సమాచారం.

తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నిక సందర్భంగా అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు వినని ఉన్నతాధికారులు ఇప్పుడు ఎన్ని పాట్లు పడుతున్నారో.. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు గుర్తుకు తెచ్చుకుంటున్నట్లు తెలుస్తోంది. గత నవంబరు, డిసెంబరులో జిల్లా వ్యాప్తంగా దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ.. అధికారపార్టీ వలంటీర్లతో ఇంటింటి సర్వే నిర్వహించింది. ఈ సర్వే రిపోర్టును సచివాలయాల కంప్యూటర్ల ద్వారా అధికారపార్టీ నాయకులు కోరుకున్న చోటికి వెళ్లింది. ఇది ఖచ్చితంగా నేరమే.. ఈ విషయమై రాబోయే రోజుల్లో.. ప్రతిపక్షాలు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం. ఇదే జరిగితే.. సచివాలయ సిబ్బంది బలయ్యే అవకాశం ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో వలంటీర్ల రాజీనామాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు



ఈసీ హెచ్చరించినా.. వీళ్లు మారరా..?

చిన్నమండెం, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీ కార్యక్రమాలకు దూరంగా వలంటీర్లు ఉండాలని ఎన్నికల కమిషన్ పదేపదే హెచ్చరించినా.. వలంటీర్లకు చీమకు కుట్టినట్టు కూడా కనిపించడం లేదు. కేశాపురం గ్రామ పంచాయతీలో శనివారం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. ఈయనతో పాటు ఏడుమంది వలంటీర్లు, ఒక ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంటు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వీరిలో కొందరు ఎన్నికల ప్రచారంలో అంతా తామై ఎమ్మెల్యేని ఇంటింటికీ తీసుకెళ్లి.. ఓటర్లకు సంక్షేమ పథకాలు వివరించారు. ఈ ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు సాంబశివ, ప్రశాంత్, ఆదినారాయణ, భార్గవ్, మహిళా వలంటీర్లు లక్ష్మీప్రసన్న, జ్యోతి, సోమేశ్వరితో పాటు ఒక ఫీల్డ్ అసిస్టెంటు కూడా పాల్గొన్నారు వీళ్లందరూ ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం నిబంధనలకు విరుద్ధమని వీళ్లపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో రామకృష్ణను వివరణ కోరగా.. ఇప్పటి వరకు తమ దృష్టికి రాలేదన్నారు.

ఎంపీపీ కుటుంబంపై

వలంటీర్ దాడి

● ఎంపీపీ సహా నలుగురికి గాయాలు ● ఒకరు మదనపల్లెకు తరలింపు
● వలంటీర్ సహా ఆరుగురిపై కేసు నమోదు


దాడి సంఘటనపై విచారిస్తున్న సీఐ సూర్యనారాయణ

బి.కొత్తకోట, ఏప్రిల్ 6: సాక్షాత్తూ అధికార పార్టీ మండల పరిషత్ అధ్యక్షురాలి కుటుంబంపై ఓ వలంటీర్ దాడి చేసి చితకబాదిన సంఘటన శనివారం బి.కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. తీవ్ర గాయాలపాలైన ఎంపీపీ కుటుంబ సభ్యులు ఆస్పత్రి పాలయ్యారు. శనివారం మండలంలో సంచలనం రేపిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ సూర్యనారాయణ, ఎంపీపీ లక్ష్మీనరసమ్మ తెలిపిన వివరాలిలా... బి.కొత్తకోట ఎంపీపీ మేదరి లక్ష్మీనరసమ్మ కుటుంబంతో కలిసి మండలంలోని బుచ్చిరెడ్డిగారిపల్లెలోని ఎస్సీ కాలనీలో నివాసం వుంటున్నారు. ఈ కాలనీలో వున్న 13 సెంట్ల ప్రభుత్వ స్థలంలో గల చింతమాన్లను స్థానిక సర్పంచ్ చంద్ర ఇటీవల కోసివేశాడు. దీనిపై ఎంపీపీ లక్ష్మీనరసమ్మ అభ్యంతరం చెబుతూ కాలనీ వాసులతో కలిసి తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సదరు స్థలాన్ని అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు కేటాయించాలని కోరారు. ఇదిలా వుండగా.. ఆ చింత దుంగలను ఇటుకబట్టీ కోసం అంటూ స్థానిక వలంటీర్ నరేష్ తరలించుకున్నాడు. ఈ విషయం సైతం తహశీల్దార్ దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం వలంటీర్ నరేష్ తన కుటుంబీకులైన హరీష్, గణేష్ మరో ముగ్గురితో కలిసి ఎంపీపీ నివాసంపైకి దాడికి తెగబడ్డారు. ఇంట్లో వున్న ఎంపీపీ భర్త మేదరి నరసింహులును, మామ చిన్నాయప్పను కొట్టి గాయపరిచారు. అడ్డువచ్చిన ఎంపీపీ లక్ష్మీనరసమ్మ, తోడికోడళ్లు లక్ష్మీనరసమ్మ, రమణమ్మల పై కూడా దాడి చేశారు. వీరందరినీ బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో రమణమ్మను మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై ఎంపీపీ మాట్లాడుతూ గతంలో కూడా వలంటీర్ తమపై దౌర్జన్యం చేశాడని పేర్కొన్నారు. సీఐ సూర్యనారాయణ ఆసుపత్రి వద్దకు చేరుకుని సంఘటనపై ఆరా తీశారు. నిందితులైన వలంటీర్ నరేష్‌తో పాటు, హరీష్, గణేష్ మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ నేత నాగోతు రమేశ్‌తో సుగవాసి భేటీ

● రాజంపేట మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటన

రాజంపేట, ఏప్రిల్ 6: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడుతో రాజంపేట టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం భేటీ అయ్యారు. శనివారం కూచివారిపల్లె గ్రామ పంచాయతీ బసినాయుడుగారిపల్లె గ్రామంలోని ఆయన స్వగృహానికి వెళ్లి ఆయన మద్దతు కోరారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థుల విజయానికి తనవంతు కృషి చేయాలని కోరారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, అదే విధంగా ఎంపీగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థి, మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలన్నారు. తనశక్తి వంచన లేకుండా పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని రమేశ్‌నాయుడు తెలిపారు.


నాగోతు రమేశ్‌ను కలిసిన బాలసుబ్రమణ్యం

ఎంపీగా ఏమి సాధించారు?

● ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారా..?
● ప్రత్యేక హోదాను పట్టించుకోకుండా గాడిదలు కాస్తున్నారా?
● వివేకా హత్యకేసు నిందితుడు అవినాశ్‌రెడ్డిని ఓడించండి
● కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అందరికీ న్యాయం
● కడప ఎన్నికల ప్రచారంలో ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల

కడప(కలెక్టరేట్), ఏప్రిల్ 6: "ఇన్నాళ్లు ఎంపీగా ఉండి ఏమి సాధించారు..? రాష్ట్రానికి ప్రత్యేక హోదా, కడప బెంగళూరు రైల్వే లైను పట్టించుకోకుండా ఐదేళ్లు గాడిదలు కాస్తున్నారా.." అంటూ కడప ఎంపీ అవినాశ్‌రెడ్డిని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. తమ చిన్నాన్న వైఎస్ వివేకానందరెడ్డిని అతి కిరాతకంగా చంపించిన నిందితుడు వైఎస్ అవినాశ్‌రెడ్డిని ఎన్నికల్లో ఓడించాలని, రాజశేఖర్‌రెడ్డి బిడ్డనైన తనను ఆశీర్వదించి గెలిపించాలని ఆమె జిల్లా ప్రజలను అభ్యర్థించారు. కాంగ్రెస్ తరఫున కడప ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న వైఎస్ షర్మిల చేపట్టిన బస్సుయాత్ర రెండోరోజు శనివారం కడప నగరంలో సాగింది. పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి, ఇతర కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలసి ఆమె నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పెద్దదర్గాలో, దేవుని కడపలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో, మరియా పురం చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. పెద్దదర్గా, చిన్నచౌకు, ఐటీఐ, ఏడురోడ్ల కూడళ్లలో షర్మిల ప్రసంగించారు. వైఎస్ అవినాశ్‌రెడ్డి ఎంపీగా ఏమి సాధించారో తెలపాలని సవాల్ విసిరారు. ఉక్కు ఫ్యాక్టరీని పట్టించుకోలేదని, దీంతో జిల్లాలో లక్షలాది మంది యువతకు ఉపాధి లేకుండా చేశారన్నారు.


పెద్దదర్గా వెలుపల
మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కడప-బెంగళూరు రైల్వే లైను తెస్తే అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి రద్దు చేశారన్నారు. ఎంపీగా ఈ ప్రాంత ప్రజల అభివృద్ధికి పాటుపడకుండా గాడిదలు కాస్తున్నారా? అని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ ఆశయాలను జగన్‌రెడ్డి తుంగలో తొక్కారని మండిపడ్డారు. తండ్రిని చంపిన బాధలో సునీతమ్మ న్యాయస్థానాల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి ఏర్పడిందని.. అయితే తండ్రిని ఆమే చంపిందని నింద మోపడం ఈ దుర్మార్గులకే చెల్లిందన్నారు. చిన్నాన్నను చంపిన వారికి శిక్ష పడాలని, వైఎస్సార్‌కు ఆత్మశాంతి కలిగించాలని తాను కడప ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా అన్నారు. అయితే కొందరు జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నానని తనను వైఎస్ రాజశేఖర్ రెడ్డికే పుట్టలేదనడం బాధాకరమన్నారు. అంటే వాళ్ల స్వార్థం కోసం తన తల్లి విజయమ్మను కూడా అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ ఆశయాలు సాధించేందుకు ఆయన బిడ్డగా, ఆయన చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పార్టీలోనే ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. తాను కడప బిడ్డనని, అందరికీ అందుబాటులో ఉండీ ప్రతి ఒక్కరి సమస్యలు తీర్చుతానన్నారు. హత్య కేసు నిందితుడు అవినాశ్‌రెడ్డికి.. రాజశేఖర్‌రెడ్డి బిడ్డనైన తనకు మధ్యజరిగే ఈ పోటీలో తనను ఎంపీగా గెలిపించాలని విజప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరాములు, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నజీర్ అహమ్మద్, నగర అధ్యక్షుడు విష్ణుప్రీతంరెడ్డి, సంఘ సేవకుడు సలావుద్దీన్, సీపీఐ నేతలు గాలి చంద్ర, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. కాగా.. వైఎస్ షర్మిల బస్సుయాత్రలో భాగంగా మూడోరోజు ఆదివారం కమలాపురంలో పర్యటించనున్నారు.

స్వేచ్ఛాయుత ఎన్నికలకు కృషి

● కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్
● నగదు, బంగారు, వెండి, మద్యం, గంజాయిపై డేగ కన్ను
● ఎస్పీ బి.క్రిష్ణారావు

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 6: జిల్లాలో శాంతియుతమైన వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాత ఎన్నికలకు కృషి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియోకాన్ఫరెన్స్ నిర్వ హించి వివిధ అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్ కిశోర్, ఎస్పీ క్రిష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ ఓటర్ జాబితాకు సంబంధించిన ఫామ్స్ పరిష్కారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై చర్చించారు. సీ విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారం, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్, తనిఖీల్లో సీజ్ చేసిన నగదుపై వారు అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టుబడిన నగదు, మద్యం, గంజాయి, వస్తువులపై ఆరా తీశారు. అవసరమైన భద్రత సిబ్బంది అందుబాటులో ఉండాలని వారు పోలీసు అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఏప్రిల్ 15 లోపు పెండింగ్ ఫామ్స్‌ను పరిష్కరించాలన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఎన్నికల నియమావళిని పాటించాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నగదు, బంగారం, వెండి, మద్యం, గంజాయి వస్తువులపై డేగ కన్నుతో పరిశీలిస్తున్నామని, ఎన్నికల నియమావళిని ఎవరూ అతిక్రమించకూడదని వారు అన్నారు. జిల్లా వ్యాప్తంగా, రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేశామని, ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాజ్‌కమల్, డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో రాష్ట్రం దివాలా

● ఇసుక దందాలు, రౌడీయిజం, అక్రమ కేసులతో వైసీపీ పాలన
● అప్పులు చేసి బటన్ నొక్కడం.. రేట్లు పెంచి ప్రజలను నొక్కడమే పని
● రూ.8 లక్షల కోట్ల అప్పులతో ప్రజల నెత్తిన టోపీ
● ఆత్మీయ సమావేశంలో మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 6: గడిచిన ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని దివాలా తీశారని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. శనివారం జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని ఓ కల్యాణమండపంలో రాయచోటి టీడీపీ అభ్యర్థి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ జనసందోహం మధ్య టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కిరణ్‌కుమార్‌రెడ్డికి పూలదండలు, బాణసంచాలు, మంగళవాయిద్యాలతో పెద్దఎత్తున స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ రాష్ట్రానికి చేసింది శూన్యమని, ప్రధాని నరేంద్రమోదీ వద్ద దిష్టిబొమ్మలా నిలబడ్డారే తప్ప రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, వాటాలు అడగలేదన్నారు. కేవలం కేసుల మాఫీ కోసం ప్రయత్నించారని విమర్శించారు. రాష్ట్రానికి పెన్షన్స్‌తోపాటు, ఉద్యోగ జీతాలను కూడా కేంద్రం ఇస్తుంటే అది కూడా జగన్‌మోహన్ ఇస్తున్నట్లు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. గడిచిన ఐదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి రూ.8లక్షల కోట్ల అప్పులు తెచ్చి దివాలా తీయించారని ఆరోపించారు. అప్పులు విపరీతంగా పెరిగిపోతున్నాయే కానీ అభివృద్ధి మాత్రం ఎక్కడా కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. తాను సీఎంగా ఉన్న సమయంలో రూ.90 వేల కోట్లు అప్పులుంటే, ఇప్పుడు ఆ అప్పులు రూ.8 లక్షల కోట్లకు చేరుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పులు చేయడం బటన్ నొక్కడం అన్ని రకాల వస్తువులపై రేట్లను విపరీతంగా పెంచి సామాన్య ప్రజల నడ్డివిరుస్తున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసిన ఇసుక దందాలు, మద్యం, డ్రగ్స్‌మాఫియాలతో పాటు దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులు, విపరీతంగా పెరిగాయని చెప్పారు. ఇదేమిటని ఎవరైనా ప్రశ్నిస్తే వారిపై అక్రమ కేసులు పెట్టడం, వారి భూములు లాక్కోవడం, అవసరమైతే దాడులకు దిగడం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతినిత్యం చూ స్తున్నామని చెప్పారు. అంతేకాక ప్రభుత్వ భూములతో పాటు, ప్రైవేట్ భూములు, డీకేటీ భూములు కబ్జా చేయడం వైసీపీ నేతలు పనిగా పెట్టుకొన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న ఈ అరాచకాలు, దందాలు పోవాలంటే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. స్వేచ్ఛ, అభివృద్ధి ఓ పక్క, దౌర్జన్యాలు అరాచకాలు మరో పక్క ఉన్నాయని, ఈ రెండింటిలో ఏది కావాలో ప్రజలు నిర్ణయించుకోవాలని కోరారు. అంతేకాకుండా వివేకానందరెడ్డిని చంపిన వారిని శిక్షించి తమకు న్యాయం చేయాలంటూ సీఎం సోదరీమణులు తిరుగుతున్నప్పటికీ సీఎం స్పందించకపోవడం దారుణమన్నారు. తనతో ఎన్నోసార్లు రాజశేఖర్‌రెడ్డి చెప్పేవారని, పులివెందులలో తాను, తన తమ్ముడు పోటీ చేస్తే తనకంటే 5 వేల ఓట్లు ఎక్కువ వస్తాయని రాజశేఖర్‌రెడ్డి చెప్పే వారిని గుర్తు చేశారు. ప్రతి కార్యాలయం వద్ద గుమస్తాలాగా వెళ్లి పనులు చేయించేవారని, అంతటి ప్రజాదరణ కలిగిన వ్యక్తి వివేకానందరెడ్డి అన్నారు. అలాంటి వ్యక్తిని హత్య చేశారంటే జగన్‌రెడ్డికి తెలియకుండా జరుగుతుందా అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.


ఆత్మీయ సమావేశంలో కూటమి నేతలకు అభివాదం చేస్తున్న నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి,
చిత్రంలో కిశోర్‌కుమార్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, ప్రసాద్‌బాబు తదితరులు

అనంతరం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లుగా రాష్ట్రంలో రాక్షస పాలన నడుస్తోందని, మరో నెల రోజుల్లో రాక్షస పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో ఏ వర్గానికి న్యాయం జరగలేదన్నారు. అనంతరం రాయచోటి నియోజకవర్గ అభ్యర్థి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సభ సాక్షిగా మండిపల్లె, సుగవాసి కుటుంబ సభ్యులు ఒక్కటయ్యారని తెలిపారు. అదే విధంగా తాను ఎమ్మెల్యేగా గెలిస్తే తనకు వచ్చే జీతం మొత్తం రాయచోటి అభివృద్ధికి కేటాయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడుకోవాలంటే రాబోయే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అనంతరం రాజంపేట టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీకి ఆదరణ రోజు రోజుకి పెరుగుతోందని, అన్ని వర్గాల ప్రజలు టీడీపీకి అండగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్వర్ బాషా, మండిపల్లె రాహుల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మల్లు నర్సారెడ్డి, మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు, రవీంద్ర బాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్, బీజేపీ నేతలు శివ, గంగిరెడ్డి, శివప్రసాద్, మదన్‌మోహన్, రాంప్రసాద్‌రెడ్డి, నాగసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రియాజ్, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులు హత్య కేసులో ఐదుగురు అరెస్టు

● పూర్తిస్థాయిలో విచారిస్తున్నాం : కడప డీఎస్పీ ఎండీ షరీఫ్

కడప (క్రైం), ఏప్రిల్ 6: పెండ్లిమర్రి మండలం చిన్నదాసరిపల్లె పొలాల్లో ఏప్రిల్ 2వతేదీన జరిగిన ఆదిమూలం శ్రీనివాసులు హత్య కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ తెలిపారు. కడప డీఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ హత్య కేసులో నిందితులైన చిన్నగుర్విరెడ్డి గారి నాగిరెడ్డి అలియాస్ జగన్‌మోహన్‌రెడ్డి, నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి, నాగిరెడ్డి అలియాస్ చిన్న నాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి అలియాస్ డేగలను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో మరికొందరిని కూడా అరెస్టుచేయాల్సి ఉందన్నారు. వివరాల్లోకి వెళితే... ఏప్రిల్ 2న చిన్నదాసరిపల్లె పొలాల్లో అనుమానాస్పద స్థితిలో చనిపోయిన శ్రీనివాసులు హత్యపై మృతుడి తమ్ముడు వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పెండ్లిమర్రి పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏర్పాటైన స్పెషల్ టీమ్స్ ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. కడప - పులివెందుల ప్రధాన ర హదారిలోని కాశినాయన గుట్ట వద్ద నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. చిన్నగుర్విరెడ్డి గారి నాగిరెడ్డి వద్ద నుంచి టీ షర్టు నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ హత్యకు భూ సమస్య ప్రధాన కారణమని తెలుస్తోందన్నారు. సదరు గ్రామ పరిధిలో 70 సెంట్లు భూమి సంబంధించి సమస్య ఇరువర్గాల మధ్య తలెత్తినట్లు తెలిపారు. ఈ సమస్యల్లో భాగంగానే ఈ హత్య జరిగినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతూనే ఉందని, మరికొందరి ప్రమేయం ఉందని పూర్తి వివరాలు తెలియగానే అనుమానితులను కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. సమావేశంలో ఇన్‌స్పెక్టరు కంభగిరి రాముడు, కడప రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టరు నాగరాజు పాల్గొన్నారు.

జాతీయ యువజనోత్సవాల్లో 'వైవీయూ' ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రారు

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 6: జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో వైవీయూ విద్యార్థులు ప్రతిభ చాటారు. విజేతలను వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసరు వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాధరెడ్డి అభినందించారు. వైవీయూ లలిత కళల విభాగం విద్యార్థులు ఈ ఏడాది జనవరిలో జరిగిన దక్షిణ భారతదేశ యువజనోత్సవాల్లో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచి జాతీయ స్థాయికి అర్హత సాధించారన్నారు. నుదియానా, పంజాబ్ అగ్రికల్చర్ విశ్వవిద్యాలయంలో మార్చి 27 నుంచి ఏప్రిల్ 1 వరకు జరిగిన జాతీయ స్థాయి యువజనోత్సవ పోటీల్లో దాదాపు 108 యూనివర్సిటీలు పోటీ పడగా, వారిలో వైవీయూ విద్యార్థులు వై.అరవింద్ కార్టూన్ విభాగంలో ద్వితీయ స్థానం, రమాజ్యోతి రంగోలి విభాగంలో తృతీయ స్థానం, దేవదాస్ పోస్టరు విభాగంలో తృతీయ స్థానం, శ్రీలత మెహందీ ఆర్ట్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారన్నారు. విజేతలుగా విశ్వవిద్యాలయానికి చేరుకుని యూనివర్సిటీ కల్చరల్ కో ఆర్డినేటరు ప్రొఫెసరు విజయభారతి, లలితకళల శాఖ విభాగాధిపతి మృత్యుంజయరావు బృందానికి నేతృత్వం వహించిన ప్రొఫెసరు పుత్తా పద్మ, కాత్యాయని ఆధ్వర్యంలో వీసీని వారు ఆయన చాంబరులో కలిశారు. కార్యక్రమంలో లలిత కళల శాఖ విభాగాధిపతి కోటా మృత్యుంజయరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'తప్పుడు అంకెలతో కరపత్రాలు పంచడం శోచనీయం'



విలేకరులతో మాట్లాడుతున్న జిలాన్

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 6: ఎన్నికల నియమ నిబంధనలు పక్కనబెట్టి మసీదు ఆవరణలో అబద్దపు అంకెల గారడీ కరపత్రాలు పంచడం భావ్యం కాదని టీడీపీ నేత జిలాన్ తెలిపారు. శనివారం కడప నగరం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మన రాష్ట్ర బడ్జెట్ 2.79 లక్షల కోట్లు ఉంటే ముస్లిం మైనార్టీలకు రూ.12 లక్షల కోట్లు ఇచ్చామనడం విడ్డూరంగా ఉందన్నా రు. తప్పుడు లెక్కలు, రాతలతో కరపత్రాలు పంచడం వైసీపీకే చెల్లు అన్నారు. మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు క్రిసెంట్ జిలానీబాషా, నాయకులు ఖాజాపీర్, బీబీ, డైమండ్ మహబూబ్‌ఖాన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన బీఎస్‌ఎన్‌ఎల్

రేణిగుంట వరకు పని చేయని నెట్‌వర్క్ ● అందుబాటులో లేని సిబ్బంది

ఇతర నెట్‌వర్క్‌లకు వెళుతున్న వినియోగదారులు

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 6: బీఎస్‌ఎన్‌ఎల్ అంటే పేరు కాదు బ్రాండ్. ఒకప్పుడు దేశంలో ప్రతి ఒక్కరికీ బీఎస్‌ఎన్‌ఎల్ విశిష్టమైన సేవలు అందించేది. అత్యుత్తమైన సేవలు అందించే బీఎస్‌ఎన్‌ఎల్ ప్రైవేట్ కంపెనీలకు దీటుగా వినియోగదారులకు సేవలు అందిస్తూ ఎక్కడికి వెళ్లినా నెట్‌వర్క్ అందుబాటులో ఉండేది. ప్రస్తుతం వినియోగదారులను కోల్పోతూ తిరోగమన దిశలో ఉంది. ప్రస్తుత పోటీ ప్రపంచంలో బీఎస్‌ఎన్‌ఎల్ నెట్‌వర్క్ సేవలు కనుమరుగేయ్యే పరిస్థితి దాపురించిది. ముఖ్యంగా ప్రధాన నగరాలు, పట్టణాల్లో సేవలు అందుబాటులో ఉన్నా గ్రామీణ ప్రాంతంలో పూర్తిగా స్తంభించాయి. కోడూరు నుంచి రేణిగుంట వరకు మూడు నెలలుగా బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు అందుబాటులో లేవు. ఫలితంగా 10 వేల మంది వినియోగదారులు ఇతర నెట్‌వర్క్‌లకు బదిలీ అయ్యారు. బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకున్నారు. కార్యాలయంలో సిబ్బంది కనపడరు. వినియోగదారులకు సమాచారం తెలపలేక టెలికాం అధికారి సెలవులపై వెళ్లినట్లు సమాచారం.

అసలు సమస్య ఎక్కడ?

అసలు సమస్య ఎక్కడ మొదలైందంటే మండలంలోని కుక్కలదొడ్డి, శెట్టిగుంట, ఉప్పరపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న కంట్రోల్ బోర్డులు పూర్తిగా కాలిపోవడంతో నెట్‌వర్క్ సేవలు స్తంభించాయి. 2002లో మోటొరోలా టెక్నాలజీ సహాయంతో 2జీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకు కంట్రోల్ బోర్డులు మరమ్మతులు నోచుకోకపోవడంతో అవి పూర్తిగా కాలిపోయాయి. అధికారుల దృష్టికి సమస్య వెళ్లిన కూడా స్పందన లేదు. జోనల్ స్థాయి అధికారులకు స్పందిస్తే కాని సమస్య పరిష్కారం కాదు.



తాళాలు వేసిన రైల్వేకోడూరు బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం

ఇప్పటికీ బీఎస్‌ఎన్‌ఎల్

నేను ఇప్పటికీ బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్ కార్డు వాడుతున్నాను. గ్రామంలో ప్రతి చోటా నెట్‌వర్క్ సిగ్నల్ అందుబాటులో ఉండేవి. ప్రైవేట్ నెట్‌వర్క్‌లు ఎన్ని వచ్చిన మా గ్రామంలో అంతా బీఎస్‌ఎన్‌ఎల్ మాత్రమే వాడేవారు. 4జీ, 5జీ నెట్‌వర్క్ సేవలు అందుబాటులో వచ్చినా కూ డా బీఎస్‌ఎన్‌ఎల్ సిమ్ ప్రత్యేకంగా ఉపయోగించే వాళ్ళం. ఇతర నెట్‌వర్క్‌లకు బదిలీ కాకుండా ప్రత్యేకంగా డ్యూయల్ మొబైల్ సిమ్ కార్డులు వాడే వాళ్ళం. మూడు నెలల నుంచీ బీఎస్‌ఎన్‌ఎల్ సేవలు పూర్తిగా అందుబాటులో లేరు. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం.

జయప్రకాష్, మాజీ మార్కెట్ ఉపాధ్యక్షుడు శెట్టిగుంట

జోనల్ అధికారులు స్పందించాలి

వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్య గురించి జోనల్ స్థాయి అధికారులకు సమాచారం చేరవేశాం. 2002లో నిర్మించిన కంట్రోల్ బోర్డులు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొత్తవి ఏర్పా టు చేయాలి. ప్రసుత్తం 4జిగా అప్‌గ్రేడ్ చేస్తున్నాం. 10 వేల ఉన్న వినియోగదారులు పూర్తిగా వేరే నెట్‌వర్క్‌ను పోర్టబులిటీ అయ్యారు.

జూనియర్ టెలికాం అధికారి రవీంద్ర

జగన్,భారతి ప్రమేయంతోనే వివేకా హత్య

గండికోట నిర్వాసితులకు రూ.12 లక్షలు ఇప్పిస్తా ● ఎమ్మెల్యేకి మాట్లాడే భాష తెలియదు

కొండాపురంలో రోజుకు రూ.20 లక్షల ఇసుక దోపిడీ : మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి

కొండాపురం,ఏప్రిల్ 6: మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్, ఆయన సతీమణి భారతి ప్రమేయం ఉందని ఎన్డీయే కూటమి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవగుడి ఆదినారాయణరెడ్డి ఆరోపించారు. స్థానిక రాఘవేంద్ర స్వామి కల్యాణ మండపంలో శనివారం ఏర్పాటు చేసిన బీజేపీ, టీడీపీ, జనసేన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అధికారంలోకి వస్తే గండికోట నిర్వాసితులకు ప్రస్తుతం ఇచ్చే రూ.10 లక్షల పరిహారానికి అదనంగా మరో రెండు లక్షలు కలిపి రూ.12 లక్షలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే టీడీపీ హయంలో రూ.1,82,000 పరిహారాన్ని రూ.6,75000కి పెంచామన్నారు. గండికోట నిర్వాసితులకు పునరావాస కాలనీల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ముంపువాసుల ఇళ్ల స్థలాలకు పట్టాలు, అర్హత ఉండి కూడా పరిహారం అందని వారి కోసం తిరిగి సోషియల్ ఎకానమిక్ సర్వే చేయిస్తామని గండికోట ముంపువాసులకు హామీ ఇచ్చారు. గండికోట బ్యాక్‌వాటర్‌తో పెన్నా నది ఆవలి గ్రామాల రాకపోకలకు తన హయంలో శంకుస్థాపన చేసిన సంకేపల్లే బ్రిడ్జిని నిర్మిస్తామన్నారు. కొండాపురంలో రైళ్ల నిలుపుదల కోసం కృషిచేస్తానన్నారు. కొండాపురం నుంచి పులివెందుల రోడ్డును నేషనల్ హైవేకి కలుపుతామన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి మాట్లాడే భాష తెలియదన్నారు. కొండాపురం ప్రాంతంలో రోజుకు రూ.20 లక్షల ఇసుక దోపిడీ జరుగుతోందని ఆయన మండిపడ్డారు. డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటేనే పూర్తి స్థాయిలో అభివృద్ధి జరుగుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మేల్యేగా, భూపేశ్‌ను కడప ఎంపీగా గెలిపించాలన్నారు. బీజేపీ నేతలు దేవగుడి శివనారాయణరెడ్డి, దేవగుడి రాజేష్‌రెడ్డి టీడీపీ, బీజేపీ మండలాధ్యక్షులు నాగేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహా రెడ్డి, నేతలు పద్మజ, రమణారెడ్డి, అరుణ్ కుమార్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, రామాంజులరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవగుడి ఆదినారాయణరెడ్డి

గండి వేలంలో రూ.11.65లక్షల ఆదాయం

చక్రాయపేట, ఏప్రిల్ 6: గండి క్షేత్రంలో తలనీలాలు, ఎండుకొబ్బరికి నిర్వహించి వేలం పాటల్లో రూ.11.65లక్షల ఆదాయం చేకూరిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముకుందరెడ్డి తెలిపారు. గండి కార్యాలయంలో శనివారం నిర్వహించిన వేలం పాటల్లో ఏలూరు వాసి వేణుగోపాల్ తలనీలాలకు రూ.11లక్షలు, వేంపల్లెకు చెందిన భాస్కర్‌రెడ్డి నిల్వ ఉన్న ఎండుకొబ్బరికి రూ.65 వేలు పాడి పాట దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కృష్ణతేజ, పోలీసు సిబ్బంది, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన కంటైనర్

నందలూరు, ఏప్రిల్6: కడప-చెన్నై జాతీయ రహదారిలోని తహసీల్దారు కార్యాలయ మలుపు వద్ద శనివారం తెల్లవారుజామున చెన్నై నుంచి మహారాష్ట్రకు టైర్లలోడుతో వెళుతున్న కంటైనర్ లారీ అదుపు తప్పి రోడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో పెను ప్రమాదం తప్పి అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి రోడ్డుపై పడిన కంటైనర్‌ను, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా అక్కడి నుంచి తీయించి వేశారు. కంటైనర్‌ను తొలగిస్తున్న సమయంలో ట్రాఫిక్‌కు కొంతఅంతరాయం ఏర్పడింది.

బానిసలుగా వుండలేకే వైసీపీని వీడుతున్నాం

ఎమ్మెల్యే రాచమల్లును విభేదించి టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మి

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 6: వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి కింద బానిసలుగా వుండలేకే వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరుతున్నట్లు మూడో వార్డు వైసీపీ కౌన్సిలర్ జంబాపురం వెంకటలక్ష్మీ, ఆమె భర్త మాజీ కౌన్సిలర్ రామాంజనే యరెడ్డి ప్రకటించారు. మూడో వార్డులో వీరి ఆధ్వర్యంలో 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరందరికి మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డితో కలిసి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేపై అసంతృప్తిగా వుండి పార్టీ కార్యాక్రమాల్లో పాల్గొనని జంబాపురం రామాంజనే యరెడ్డి టీడీపీలో చేరుతున్నారని అనుమానించి ఎమ్మెల్యే రాచమల్లు వారి ఇంటికెళ్లి అంతుచూస్తానని బెదిరించడం అతని దౌర్జన్య రాజకీయాలకు నిదర్శనమన్నారు. టీడీపీలో చేరిన జంబాపురం రామాంజనేయరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటినుంచీ వార్డులో కనీసం రూ.5 లక్షల మేరకు కూడా అభివృద్ధి పనులు పెట్టలేదన్నారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వంలో వచ్చిన పింఛన్లు రేషన్ కార్డులు తప్ప ఒక్క కొత్త పెన్షన్ వైసీపీ ప్రభుత్వంలో ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవ రెడ్డి, మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ ఛైర్మెన్ వీఎస్ ముక్తియార్, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ కామిశెట్టి బాబు, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షులు ఘంటశాల వెంకటేశ్వర్లు, ఈవీ సుధాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సానా విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ బాదుబోయిన సుబ్బారావు. జనసేన ప్రతినిధులు సుంకర మురళి జిలాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ జంబాపురం వెంకట లక్ష్మీ మాజీ కౌన్సిలర్ జంబాపురం రామాంజనేయరెడ్డి

చిన్నారిపై కుక్క దాడి

ఖాజీపేట, ఏప్రిల్ 6: ముస్లిం కాలనీలో ఉదయం ఉజాస అనే బాలుడిపై విచక్షణారక్షితంగా దాడి చేశాయి. అదే కాలనీలో ఇప్పటికే ఇద్దరిపై దాడి చేయడంతో వారు చికిత్స పొందుతున్నారు. మండల పరిధిలో ఏదో ఒక చోట పిల్లలు కుక్కకాటుకు గురవుతున్నారు. రాత్రివేళల్లో స్కూటర్లలో వెళ్లాలంటే కుక్కలు వెంబడించడంతో వాహనదారులు ఎందరో కిందపడి గాయాలపాలయ్యారు. కుక్కల దాడిలో గాయపడిన బాలుడు చికిత్స పొందుతున్నాడు. అధికారులు స్పందించి కుక్కలు పట్టుకుని పిల్లల ప్రాణాలను కాపాడాలని కాలనీవాసులు కోరుతున్నారు.



గాయపడిన బాలుడు

మండుటెండలో ఉపాధి పనులు

44 డిగ్రీల ఎండలో ఉపాధి కూలీల అవస్థలు ● నాలుగు గంటలు పనిచేయలేమంటున్న వైనం

కిలోమీటర్ల దూరం కనీస సౌకర్యాలు కరువు



మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

రాజుపాలెం, ఏప్రిల్ 6: మండలంలో ఉపాధి పనులు మొదలయ్యాయి. 15 పంచాయతీలకు 1948 మంది ఉపాధి పనుల్లో పాల్గొననున్నారని ఉపాధి అధికారులు తెలిపారు. ఎండలు విపరీతంగా ఉండడం, 44 డిగ్రీల ఎండలు కాస్తుండడంతో ఉపాధి కూలీలతో నాలుగు గంటలు పని చేయిస్తుండడంతో తట్టుకోలేకపోతున్నామని కూలీలు వాపోతున్నారు. ఉదయం 7 నుంచి 12 వరకు పనుల్లో పాల్గొంటుండడంతో ఎండ వేడిమికి తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోతున్నారు. గ్రామంలోని చివరి ప్రాంతంలో ఈ పనులు ఏర్పాటు చేయడంతో వర్షాలు లేకపోవడం, మట్టి తవ్వకాలు గట్టిగా ఉండడంతో కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. ఇన్ని అవస్థలు పడి పనిచేసినా కనీసం మంచినీరు కానీ, నీడకు కావాల్సిన సౌకర్యాలు కానీ చేయడంలేదని కూలీలు వాపోతున్నారు. రైతు పనులు లేకపోవడంతో ఉపాధి పనులు చేసుకొనైనా పూట గడుపుదామనుకున్న కూలీలకు విపరీతమైన ఎండతో కూలీలు అవస్థలు పడుతున్నారు. కూలీలకు కనీస సౌకర్యాలైనా ఏర్పాటు చేయాలని పలువురు కూలీలు అడుగుతున్నారు.

రెండో ఫొటో అడుగుతోంది

ఉదయం 7గంటలకు ఫొటో తీస్తే 11 గంటలకు మళ్లీ రెండో ఫొటో అడుగుతోంది. ఇందుకోసం అంత వరకు ఉపాధి కూలీలు పనులు చేయాల్సిందే నంటున్నారు. మంచినీటి సౌకర్యం, తార్పాల్‌పట్టలు ఏర్పాటుకు అధికారుల సూచనలు లేవు. సెంట్రల్ గవర్నమెంట్ స్కీం కావడంతో ఈ సౌకర్యాలు కల్పించలేకున్నామని ఉపాధి కూలీలే నీటి వసతి, పట్టలు ఏర్పాటు చేసుకోవాలి.

లక్ష్మి నారాయణ, ఉపాధి హామీ ఏపీఓ

కనీస సౌకర్యాలు కనుమరుగు

గత ప్రభుత్వంలో మజ్జిగ, తార్పాల్ పట్టలు ఏర్పాటు చేసేవారు. అప్పుడు వర్షాలు పడుతుండడంతో పనులు కూడా సులభంగా ఉండేవన్నారు. వర్షాలు లేకపోవడం, గట్టిగా ఉండడం, ఎండ వేడి ఎక్కువ సెగలు కక్కుతుండడంతో కూలీలు పనులు చేయలేకపోతున్నారు. కనీసం అర్ధగంట విరామం కల్పించాలి.

శ్రీనివాసులు, బాలాయపల్లె

పంట కాల్వల్లో పనులు కల్పించండి

ఉపాధి పనులు ఇంకుడు గుంతల్లో చేయిస్తున్నారు. వర్షాలు లేక గుంతలు ఎండిపోయి గట్టిగా ఉండడంతో పనులు చేయలేకున్నారు. కనీసం కాల్వల్లో పనులు కల్పిస్తే కొంత సులభంగా ఉంటుందని తెలిపారు. ఎండ వేడిమికి సమయం కొంత తగ్గించాలని అన్నారు.

ఉప్పలపాటి నరసింహులు

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ



పుస్తకాలు అందిస్తున్న కౌండిన్య తదితరులు

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 6: విజయవాడ విద్యాధరపురంలో ఉండే సీనియర్ పాత్రికేయుడు వేలూరి కౌండిన్య తన కుమారుడు క్రిష్ణశాస్త్రి, కోడలు అనూషతో కలిసి శనివారం తన స్వగృహంలోని 680 పుస్తకాలను సీపీ బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకుడు హరిభూషణరావుకు అందించారు. ఈ సందర్భంగా సంచాలకుడు ప్రొఫెసరు రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కౌండిన్య బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో వేటూరి పాట, నవ్యనీరాజనం, కూచిపూడి భాగవతుల చరిత్ర, శ్రీపాద చిన్నకథలు, విస్మృత కథ, బెజవాడ చరిత్ర తదితర గ్రంథాలున్నాయన్నారు. కౌండిన్యను వైవీయూ వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రారు వెంకటసుబ్బయ్య, భాషాపరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు భూతపురి గోపాలక్రిష్ణ శాస్త్రి, చింతకుంట శివారెడ్డి తదితరులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

వ్యాపారి నుంచి రూ.8.50 లక్షల నగదు స్వాధీనం

కడప(క్రైం), ఏప్రిల్ 6: కడప నగరం కోటిరెడ్డి సర్కిల్ వద్ద వాహనాల తనిఖీలో శనివారం ఓ వ్యాపారి నుంచి రూ.8.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ రంగస్వామి తెలిపారు. పెండ్లిమర్రి మండలం నందిమండలానికి చెందిన శశిధర్ అనే పూతరేకుల వ్యాపారి నగదును డిపాజిట్ చేసేందుకు బ్యాంకుకు వెళుతుండగా పోలీసులు పట్టుకున్నారు. ఆ నగదును స్వాధీనం చేసుకుని ఆర్డీఓకు అప్పగించారు.



నోటీసు ఇస్తున్న ఎస్ఐ రంగస్వామి

నిప్పంటుకుని వృద్ధురాలు మృతి

కడప(క్రైం), ఏప్రిల్ 6: స్థానిక చిలకలబావి వద్ద నివాసం ఉంటున్న మురాద్‌బీ (70) ప్రమాద వశాత్తూ చీరకు నిప్పంటుకుని మృతి చెందినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. శనివారం వడలు కాల్చుతుండగా ప్రమాదవశాత్తూ ఆమె చీరకు నిప్పంటు కుంది. మంటలు చెలరేగి తీవ్రగాయాలు కావడంతో ఆమెను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందిందన్నారు మృతురాలి కుమార్తె మునీరాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ వ్యక్తి మృతి



చెన్నూరు, ఏప్రిల్ 6: చెన్నూరు మండలంలోని ఇర్కాన్ సర్కిల్ సమీప రాజంపేట రోడ్డుపై శనివారం రాత్రి జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. రాజంపేట రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆ వ్యక్తి చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేడు రాజగుంట నుంచి జనసేన అభ్యర్థి ప్రచారం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 5: నియోజకవర్గంలోని చిట్వేలి మండలంలోని రాజగుంట నుంచి జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్ ప్రచారం ప్రారంభించనున్నారని టీడీపీ ఇన్ ముక్కా రూపానందరెడ్డి, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం నియోజక వర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలి రావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో త్రయోదశి పూజలు

నందలూరు, ఏప్రిల్ 6 : నందలూరు రైల్వే కేంద్రంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పక్కనే ఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో శనివారం ఉదయం శనీశ్వరుడికి తైలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

గాలిగోపుర నిర్మాణానికి రూ.1,01,116లు వితరణ



లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి విరాళం అందజేస్తున్న శ్రీనివాసులు

రాజంపేట, ఏప్రిల్ 6: మండల పరిధిలోని భువనగిరి పల్లె లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ గాలి గోపుర నిర్మాణానికి రాజంపేట వాసి శ్రీనివాసులు 1,01,116 రూపాయల విరాళాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ దాత తన తండ్రి రావూరు గోపాలయ్య జ్ఞాపకార్థం ఈ మొత్తం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కంబయ్య గారి నరసింహ, పూల హరిప్రసాద్, మన్నేరు లక్ష్మీనరసయ్య, పూల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎంఈవో

పుల్లంపేట, ఏప్రిల్ 6 : మండల పరిధిలోని కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శని వారం ఆర్‌వో మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఎంఈవో నాగ తిరుమలరావు ప్రారంభించారు. నాబార్డు నిధులతో ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని ఎం ఈవో తెలిపారు. విద్యార్థులకు తాగునీటి సమస్య తీరిందని ప్రధానోపాధ్యాయుడు కృష్ణ మూర్తి తెలిపారు.

ఘనంగా భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినోత్సవం



రైల్వే కోడూరులో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రాజంపేట, ఏప్రిల్ 6: బీజేపీ 44వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని పాతబస్టాండు కూడలిలో బీజేపీ జెండాను ఎగురవేసి స్థానిక నాయకులు, కార్యకర్తలు ప్రజలతో కలిసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు మాట్లాడుతూ రెండు సీట్లతో ప్రారంభమైన బీజేపీ నేడు దేశంలోనే బలమైన పార్టీగా ఎదిగిందన్నారు. దేశంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏ రాజకీయ పార్టీ తీసుకోని విధంగా నిర్ణయాలు తీసుకుని చరిత్రనే తిరగరాసిందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ కూటమికి 400 పైచిలుకు స్థానాలు కైవసం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జి.కె. నాగరాజు, పెనుగొండ రమణ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పట్టుపోగుల సూర్యచంద్ర, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హరినాథ్, మండల ఉపాధ్యక్షుడు డాక్టర్ వేణుప్రసాద్‌రాజు, పట్టణ ఉపాధ్యక్షుడు తోట నగేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు పత్తిపాటి నవీన్‌కుమార్, స్థానిక ప్రజలుపాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): మైసూరివారిపల్లి పంచాయతీ పరిధిలోని బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ గడ్డం చెంగల్‌రాజు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేసి, వందలాది మోటార్ సైకిల్‌లతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో ఉన్న అల్లూరి సీతారామరాజు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, శ్రీ కృష్ణదేవరాయులు, అమరజీవి పొట్టి శ్రీరాములు, వడ్డీ ఓబన్న, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాల వేసి ఘననివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనతల సురేష్, స్టేట్ హార్టికల్చర్ సెల్ మాజీ కన్వీనర్ తోట శ్రీనివాసులు, జిల్లా హార్టికల్చర్ చైర్మన్ జయప్రకాష్ వర్మ, అసెంబ్లీ కో కన్వీనర్ గాజుల శ్రీనివాసులు, కార్యదర్శి జోగినేని సుబ్బారావు, జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి నిర్మలానంద, మండల మాజీ అధ్యక్షుడు వాకచర్ల సుబ్బారావు పాల్గొన్నారు.

షణ్ముఖ వ్యూహంతో వైసీపీని ఓడిస్తాం

- టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, ఏప్రిల్ 6: షణ్ముఖ వ్యూహంతో రైల్వేకోడూరులో వైసీపీని ఓడించి చరిత్ర తిరగరాస్తామని టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క సారి టీడీపీ, బీజేపీ, జనసేన బలపరిచిన అభ్యర్థి అరవ శ్రీధర్ ను గెలిపిస్తే రైల్వే కోడూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కూటమిలో అరమరికలు లేకుండా చూసుకునే బాధ్యత తనపై ఉందన్నారు. కూటమి ఆధ్వర్యంలో ఐదు మండలాల్లో ఒకేసారి ప్రచారం ప్రారంభమౌతుందన్నారు. వైసీపీ నాయకుల మాదిరిగా తాను ఎప్పుడూ స్వార్థ రాజకీయాలు చేయలేదన్నారు. రైల్వేకోడూరులో గెలిచి ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లకు బహుమతిగా ఇస్తామన్నారు. వైసీపీ స్వార్థ రాజకీయాలకు చాలా మంది బలయ్యారన్నారు. రైల్వేకోడూరులో బస్టాండు లేక ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికలు సమీపించడంతో పూర్తి చేయడానికి వీలులేని పనులకు భూమి పూజ చేశారన్నారు. రైల్వేకోడూరులో జరుగుతున్న అన్యాయాలను చూసి టీడీపీలో చేరామన్నారు. రైల్వేకోడూరు లో జనసేన అభ్యర్థి అరవ శ్రీధర్‌ను గెలిపించి పరిశ్రమలు, ఉద్యాన హబ్, మెడికల్ కాలేజి తదితరాలను తీసుకుని వస్తామన్నారు. రాష్ట్రంలోనే రైల్వేకోడూరును మొదటి స్థానంలో నిలుపుతామన్నారు. జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర మాట్లాడుతూ కుల, మత, ప్రాంతాలకు భేదం లేకుండా ఎన్డీఏ కూటమి ఏర్పడిందన్నారు. అరవ శ్రీధర్‌ను 30 వేల మెజార్టీతో గెలిపిస్తామన్నారు. రైల్వేకోడూరులో వైసీపీ ఎమ్మెల్యే కొరముట్లను, రాజంపేటలో ఎంపీ మిధున్‌లను ప్రజలు బంగాళాఖాతంలో కలిపేస్తారన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం చంగల్‌రాజు మాట్లాడుతూ వైసీపీని కూకటి వేళ్లతో పెకలిస్తామన్నారు. ఎమ్మెల్యే తన సొంతూరికి ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారని తెలిపారు. వైసీపీ అరాచకాలను బయటపెడతామన్నారు. జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో పవన్‌కళ్యాణ్ రైల్వేకోడూరు టిక్కెట్టు ఇచ్చారన్నారు. ప్రజలు గర్వపడేలా అభివృద్ధి పనులు చేసి చూపిస్తామన్నారు. అనంతరం ముక్కా రూపానందరెడ్డి, అభ్యర్థి అరవ శ్రీధర్ తదితరులను జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. అలాగే భారీ సంఖ్యలో జనసేన పార్టీలో యువకులు చేరారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు జోగినేని మణి, పగడాల వెంకటేష్, పగడాల చంద్రశేఖర్, వరికూటి నాగరాజు, కొక్కంటి మహేష్, ముద్దపోలు సభాపతి, ఆలం రమేష్, అంజనీకుమార్, దాసరి వీరేంద్ర, మహిళా నాయకురాళ్లు కారుమంచి సంయుక్త, కుప్పాల జ్యోతి, రాష్ట్ర బీసీ నాయకులు ఎస్వీ గోపాల్, టీడీపీ నాయకులు కట్టా గుండయ్యనాయుడు, వాసుదేవరెడ్డి, రామసుబ్బారెడ్డి, పోతురాజు నవీన్, నార్జాల హేమరాజ్, అనుముల గుండం చంద్రమోహన్, గునిపాటి రాయుడు, కల్లా చలపతి, బీజేపీ నాయకులు తోట శ్రీనివాసులు, మలిశెట్టి మాధవయ్య, దాసరాజు జయప్రకాష్‌నారాయణవర్మ, పులపూత్తూరు రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే దేశ,రాష్ట్ర భవిష్యత్తు నిర్ణయం



రైల్వేకోడూరు: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



ఓబులవారిపల్లె: ర్యాలీలో పాల్గొన్న అధికారులు

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 6: ఓటుతో రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించవచ్చని రైల్వేకోడూరు తహసీల్దార్ శివ రాముడు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిర్వ హిస్తున్న ఎస్వీఈఈపీ కార్యక్రమంలో భాగంగా గురువారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి టోల్‌గేట్ వద్దకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగంపై ప్రజలలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని వెలుగు కా ర్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, వెలుగు సమా ఖ్య సభ్యులతో ఎంపీడీవో కుళ్లాయిస్వామి ఆధ్వర్యంలో ఓటర్ అవగాహన దినోత్సవం, అనంతరం ఓటుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీటీ పీర్‌మున్నీ, ఈవోపీఆర్డీ రామ్మోహన్ రెడ్డి, ఏపీఎం ఆర్ముగం, వెలుగు సీసీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయ, మెడికల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

పుల్లంపేట, ఏప్రిల్ 6 : స్థానిక ఎర్వతవర్ధినిదేవి శాంతి లింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో క్రోధినామ సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు జయసింహ స్వామి పెంచల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, సురేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ విష్ణువర్థన్

లక్కిరెడ్డిపల్లె ఏప్రిల్ 6: ఎన్నికల సందర్భంగా లక్కిరెడ్డిపల్లె ఎస్ఐ విష్ణువర్ధన్ శనివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు. కోనంపేటలో గాలివీడు రోడ్డు వద్ద , లక్కిరెడ్డిపల్లె రవీంద్రనగర్ మర్రిచెట్టువద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. నగదు తరలించేవారు అందుకు తగిన రికార్డులు తప్పనిసరిగా చూపాలని తెలిపారు. రాత్రివేళల్లో మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవన్నారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కావుటూరితో సుగవాసి భేటీ



సుగవాసికి ఘన స్వాగతం పలుకుతున్న కావుటూరి సుబ్రమణ్యంనాయుడు

రాజంపేట, ఏప్రిల్ 6: కావుటూరి భరత్ కాలనీలో ఉన్న కావుటూరి సుబ్రహ్మణ్యం నాయుడుతో కలసి రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం అల్పాహారం స్వీకరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్, మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యనాయుడు, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కొండయ్య నాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుబ్రమణ్యంనాయుడు, సుండుపల్లి నాయకులు మహేష్‌నాయుడు, జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ, పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, మాజీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్ల నాయుడు, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు సుధీర్, కూచివారి పల్లె నాయకులు టెక్స్‌మో మల్లి, బాలాజీ, అసెంబ్లీ కార్యదర్శి సుబ్రమణ్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహానందీశ్వర దర్శనం మహాభాగ్యం

చిట్వేలి, ఏప్రిల్ 6 నిజం గెలవాలి యాత్రలో భాగంగా నారా భువనేశ్వరితో కలిసి మహానంది ఆలయంలో మహానందీశ్వరున్ని దర్శించుకోవడం మహాభాగ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు, నిజం గెలవాలి రూట్ మ్యాప్ కో-ఆర్డినేటర్ కె.కె.చౌదరి తెలిపారు. ఈ మేరకు శనివరాం మహానందీశ్వరున్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశామన్నారు. . ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న షబ్బీర్ అహ్మద్

రైల్వేకోడూరు(రూరల్), ఏప్రిల్ 6: పట్టణంలోని జామియా మజీద్ ముత్తువల్లి సయ్యద్ షబ్బీర్ అహ్మద్ ఆధ్వర్యంలో పట్టణంలోని నిరుపేద ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన తండ్రి జ్ఞాపకార్థం ప్రతి రంజాన్ మాసంలో నిరుపేద ముస్లింలకు చీరలు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. శనివారం 50 మంది మహిళలకు చీరలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ మన్సూర్, సయ్యద్ అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

లివర్ సమస్య బాధితుడికి ఆర్థిక సాయం



మోడపోతుల నరసింహ

చిట్వేలి, ఏప్రిల్ 6 : మండల పరిధి లోని కె.ఎస్.అగ్రహారం మోడపోతుల నరసింహ లివర్ సమస్యతలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ఆర్థిక సమస్యల కారణంగా వైద్యం చేయించు కునే స్తోమత లేక పోవడంతో ఇబ్బం దులు పడుతున్నాడు. పరిస్థితి తెలుసుకున్న తుమ్మ చెట్లపల్లి యువత రూ. 15 వేలు ఫోన్‌పే ద్వారా అందజేశారు. దాతలకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

వైసీపీ హయాంలో అరాచకం తప్ప అభివృద్ధి శూన్యం



ఇంటింట ప్రచారం నిర్వహిస్తున్న లక్ష్మీప్రసాద్ రెడ్డి

గాలివీడు ఏప్రిల్ 6: రాయ చోటి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మండిపల్లె రామ్‌ప్రసాదు రెడ్డి రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ యన సోదరుడు మండిపల్లె లక్ష్మి ప్రసాదురెడ్డి పిలుపు నిచ్చారు. శనివారం గోరాన్‌చెరువు పంచాయతీలో ఇం టింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభు త్వంలో అరాచకం తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే గ్రామాల్లో నెలకొన్న మంచినీటి సమస్యతో పాటు ఇతర సమస్యలన్నింటిని పరిష్కరిస్తామన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అన్ని వర్గాలవారి సంక్షేమానికి కృషి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మహ్మద్ రియాజ్, శ్రీనివాసరాజు, ప్రభాకర్‌నాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రెడ్డిప్రసాదు రెడ్డి నాయకులు చెన్నయ్య, మల్లికార్జున, రమణారెడ్డి, నాగేశ్వరావు, వెంకటశివారెడ్డి, రమణారెడ్డి, శివ, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ



ఓఆర్ఎస్ పంపిణీ చేస్తున్న కొత్తపల్లి కళాచంద్ర

పెనగలూరు, ఏప్రిల్ 6 : మండలంలోని నారాయణ నెల్లూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం ఉన్న ఆర్‌ఎంపీ డాక్టర్ కొత్తపల్లె కళాచంద్ర ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయు రాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ విద్యార్థు లు ఎక్కువగా ఎండకు తిరగరాదన్నారు. సాధ్యమైనంతవరకు నీడలో ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. ఎక్కువగా నీరు తాగాలన్నారు. నిమ్మరసం, చిటికెడు ఉప్పు, తగినంత మోతాదులో చక్కెర వేసుకొని చల్లనినీరు తాగితే వడదెబ్బ నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. గ్రామంలోని నిరుపేద ఎస్సీ, ఎస్టీ ప్రజలకు కూడా ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంచనున్నట్లు కళాచంద్ర తెలిపారు.

వాహనాల ట్రాక్ ప్రారంభం



ట్రాక్‌ను ప్రారంభిస్తున్న డీటీవో భరత్ చౌహాన్

రాజంపేట టౌన్ ఏప్రిల్6 : రాజంపేట రవాణా శాఖ కార్యా లయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వాహనాల ట్రాక్‌ను శనివారం అన్నమయ్య జిల్లా డీటీవో భరత్ చౌహాన్ ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ నూ తనంగా వాహన డ్రైవింగ్ లైసెన్సు కోరేవారికి ఈ ట్రాక్ ఎంతగానో ఉపయోగ పడుతుందని ఆయన తెలిపారు. ఈ ట్రాక్‌లో మోటారు సైకిల్, లైట్ మోటారు వెహిక ల్, వాణిజ్య వాహనాల బస్సులు, లారీల డ్రైవింగ్ నైపుణ్యాన్ని బట్టి డ్రైవింగ్ లైసెన్సు ఇవ్వబడుతుందని ఆయన తెలి పారు. వాహనదారులు తప్పనిసరిగా లైసెన్సు పొంది ఉండాలన్నారు. వాహన దారులు రోడ్డుపై నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు చాలా వరకు తగ్గుతాయన్నారు. నూతనంగా లైసెన్సు కోరే వాహనదారులు ఈ ట్రాక్‌లో ప్రతి రోజూ ఉదయం సాయంత్రం ప్రాక్టీస్ చేసుకోవచ్చునన్నారు. మదనపల్లి ఎంవీఐ దినేష్ చంద్ర, రాజంపేట ఎంవీఐ బి.వినోద్‌కుమార్, సిబ్బది పాల్గొన్నారు.

కుల, మతతత్వ పార్టీలను తరిమికొడదాం

రాజంపేట టౌన్, ఏప్రిల్ 6: కుల, మతతత్వ పార్టీలను తరిమికొట్టి ఇండియా కూటమిని గెలిపించాలని రాజంపేట అసెంబ్లీ అభ్యర్థి బుకే విశ్వనాథ నాయక్ కోరారు. ఇండియా కూటమి రాజంపేట అసెంబ్లీ అభ్యర్థిగా తనను ప్రకటించిన నేప థ్యంలో రాజంపేట ఏఐటీయూసీ కార్యాలయంలో శనివారం వామపక్ష నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం నేతలు పాల్గొన్నారు.

నామినేషన్ పత్రాల్లో తప్పులు లేకుండా చూసుకోవాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల పత్రాలను రాజకీ య పార్టీ నాయకులు ఎలాంటి తప్పులు దొర్లకుండా పూర్తి చేసి సమర్పించాలని ఆర్డీవో హరిప్రసాద్ సూచించారు. శనివారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 17 వరకు 18 ఏళ్లు నిండిన వారందరు ఓటరుగా న మోదు చేసుకోవచ్చన్నారు.ప్రచారం చేసే రాజకీయ పార్టీలు 48 గంటల ముందుగానే అనుమతి తీసుకోవాలన్నారు. కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రైల్వేకోడూరు: గ్రామీణులతో చర్చిస్తున్న సీఐ బాబు



నందలూరు: ఈదరపల్లిలో కేంద్ర బలగాల కవాతు

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

రైల్వేకోడూరు(రూరల్) ఏప్రిల్ 6: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించాలని రైల్వేకోడూరు సీఐ టి. బాబు కోరారు. ఈ సందర్భంగా శనివారం మండలంలోని చియ్యవరం, కమ్మపల్లెల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. గతంలో జరిగిన పోలింగ్ సరళి గురించి స్థానికులతో చర్చించారు. ఎన్నికల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నందలూరు: మండల పరిధిలోని ఈదరపల్లిలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అబ్దుల్ జహీర్ మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. గ్రామంలో ఎటువంటి ఘర్షణలు జరిగిన కేసు నమోదు చేయడంతో పాటు అరెస్టు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

ఒంటిమిట్ట : సీఐ పురుషోత్తంరాజు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు కూడలి నుంచి దర్గీపల్లి రోడ్డు వరకు పారా మిలిటరీ బలగాలు కవాతు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మధుసూదన్‌రావు, ఎస్బీ కానిస్టేబుల్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సిద్దవటం : సిద్దవటం ప్రధాన రహదారిలో సీఐ పురుషోత్తం రాజు, సిద్దవటం ఎస్ఐ పెద్దఓబన్న ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఓటర్లు డబ్బు, మద్యం వంటి ప్రలోభాలకు గురికాకుండా అవగాహన కల్పించామన్నారు.


ఉగాది శుభాకాంక్షలు
N.D.A. కూటమి గెలుపు
A.P. అభివృద్ధికి మలుపు
ఆత్మీయ సమ్మేళనం
తేది : 07-04-2024 ఆదివారం
ఉ॥ 9-00 గం॥ నుండి
వేదిక : కొండా ఎస్టేట్, బి. కొత్తకోట
తంబళ్లపల్లె అభివృద్ధి కోసం ...
ప్రజల జీవన పురోభివృద్ధి కోసం ...
ఆత్మీయ సమాలోచనలు చేద్దాం ... రండి - కదలి రండి
వెనుకబడిన మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునేందుకు ...
క్షామం నుంచి సంక్షేమం వైపు అడుగులు వేద్దాం ...
రండి - తరలి రండి
ఈ క్రోధినామ సంవత్సరంలో ...
పడమటి ప్రాంత రైతులు, కర్షక, కార్మిక, ఉద్యోగ,
యువత, అన్నిరంగాల ప్రజలు పచ్చటి పొలాలు,
సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు
వర్ధిల్లాలని కోరుకుంటూ.. వారికి ఇవే మా
క్రోధినామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు
ఇట్లు మీ...
కొండా నరేంద్ర
KONDA NARENDRA, M.S. (USA)
బి. కొత్తకోటలో జరిగిన రైతు సదస్సులో ఆర్గానిక్ సాగుపై రైతులకు సూచనలు ఇస్తున్న కొండా నరేంద్ర
కొండా నరేంద్ర
KONDA NARENDRA, M.S. (USA)
పారిశ్రామిక వేత్త, సామాజిక వేత్త, మానవతా వాది
తంబళ్లపల్లె నియోజకవర్గం

వివాహిత ప్రాణం తీసిన తాగునీటి బోరు

గుర్రంకొండ, ఏప్రిల్ 6:తాగునీటి కోసం బోరు పైపును పట్టుకోగా కరెంట్ షాక్ తగలడంతో ఎస్.శ్రావణి(23) అనే వివాహిత మృతి చెందింది. మండలంలోని ఎల్లుట్ల గ్రామంలో ప్రజల దాహార్తి తీర్చడానికి బోరు వేశారు. ఈ బోరులో నీరు తక్కువ పడడంతో సింగిల్ ఫేస్ మోటర్‌ను అమర్చారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి 10 గంటలకు మోటర్ కరెంట్ రావడంతో గ్రామానికి చెందిన ఎస్.జనార్ధన్, ఎస్.శ్రావణి(23) దంపతులు ఇద్దరు కలిసి తాగు నీటి బోరు వద్దకు వెళ్లి బోరు స్టార్టర్ స్విచ్‌ను ఆన్‌చేశారు. అయితే తాగునీటి బోరుకు కరెంట్ సరఫరా కావడంతో శ్రావణి విద్యుత్ షాక్‌కు గురై కిందపడిపోయింది. గమనించిన భర్త జనార్ధన్ భార్య శ్రావణిని కారులో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. బాధితురాలి తల్లి ఆర్.అనురాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు. కాగా మృతురాలికి చరిత(3), మోక్షిత(1) ఏళ్ల ఇద్దరు కుమార్తెలున్నారు. చిన్నవయస్సులో తల్లి మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. ఈ క్రమంలో ఎంపీడీవో జగదీశ్వర్‌రెడ్డి సంఘటన స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. శ్రావణి మృతికి గల వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు ఆయన తెలిపారు.

పురుగుల మందు తాగి మహిళ మృతి

నిమ్మనపల్లి, ఏప్రిల్ 6: మతిస్థిమితం లేని ఓ మహిళ ఇంటి వద్ద వున్న పురుగుల మందు తాగి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతికి చెందిన రెడ్డివారి ప్రభాకర్‌రెడ్డి భార్య సుజాత(48) శుక్రవారం సాయంత్రం తన ఇంటి సమీపంలో గడ్డికి పిచికారి చేసే మందును పొరపాటున తాగినట్లు తెలిపారు. వెంటనే కుటుంబాకులు గమనించి సుజాతను మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రి తరలించి పిరిస్థితి విషమిండంతో తిరుపతి రూయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు తెలిపారు. దీంతో మృతురాలి మరిది పిర్యాధు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

రామా! మీ ఖాళీ స్థలాలంటే నిర్లక్ష్యమా?

● దుర్గంధంగా కల్యాణ వేదిక స్థలం ● బ్రహ్మోత్సవాలు దగ్గర పడుతున్నా పట్టించుకోని టీటీడీ ● శిథిలావస్థలో పార్వేట మండపం



వాల్మీకిపురం బైపాస్ రోడ్డులోని టీటీడీ ఖాళీ స్థలం



శిథిలావస్థకు చేరిన పట్టాభిరాముడి పార్వేట మండపం

వాల్మీకిపురం, ఏప్రిల్ 6: వాల్మీకిపురం పట్టణంలోని పట్టాభి రామాలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉంది. ఈ ఆలయం టీటీడీ దేవస్థానం ఆధీనంలోకి వెళ్లినప్పటి నుంచి ఇక్కడ జరిగే బ్రహ్మోత్సవాలకు ఎంతో ప్రాచుర్యం లభించింది. కాగా ఆలయానికి సంబంధించిన ఖాళీ స్థలాలు పలుచోట్ల అటవీ ప్రాంతాలను తలపిస్తున్నాయి. స్థానిక బైపాస్ రోడ్డులోని తోటవీధి ప్రాంతంలో ఉన్న టీటీడీ స్థలంలో ప్రతియేటా పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాల సందర్భంగా భారీ ఏర్పాట్ల నడుమ సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తుంటారు. వారం రోజుల పాటు భారీగా ఏర్పాట్లు అయితే చేస్తారు కానీ కల్యాణం అనంతరం ఈ స్థలాలకు (కల్యాణ వేదికకు) దిక్కుమొక్కు లేకుండాపోతోంది. మళ్లీ మరుసటి ఏడాది వస్తే గానీ టీటీడీ అధికారులు సైతం ఈ స్థలాల వైపు చూసిన దాఖలాలు లేవు. టీటీడీకి సంబంధించిన స్థలాలకు గొప్పగా ప్రహరీ, గేట్లు ఏర్పాటు చేసినా అన్యాక్రాంతంగా మారిపోతున్నాయి. ఆలయ స్థలాలని తెలిసినప్పటికీ కొందరు దుర్గంధభరితంగా తయారు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ స్థలాలలో వేడుకలకు కల్యాణ వేదికను శాశ్వతంగా నిర్మించేందుకు టీటీడీ అధికారులు చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు. సీతారాముల కల్యాణం జరిగే ప్రాంతంలో పేద కుటుంబాలు పెళ్లిళ్ల చేసుకునేలా కూడా కల్యాణ మండపం లాంటి ఏర్పాట్లు చేయాలని స్థానికుల అభిప్రాయం. అలాగే స్థానిక ఎన్‌టీఆర్ డిగ్రీ కళాశాల ఎదుట ఉన్న టీటీడీ స్థలాలను కూడా టీటీడీ పట్టించుకోకపోవడం విచారకరం.

శిథిలావస్థలో పార్వేట మండపం

పట్టాభి రామాలయానికి అనుబంధంగా ఉన్న పార్వేట మండపం శిథిలావస్థకు చేరి నేడో రేపో కూలేందుకు సిద్ధంగా ఉన్నా టీటీడీ ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఎంతో చరిత్ర గల ఆలయాన్ని టీడీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల-తిరుపతి దేవస్థానానికి అప్పగించారు. ప్రతి ఏటా వాల్మీకిపురంలో పట్టాభిరాముని బ్రహ్మోత్సవాలు 10 రోజుల పాటు అట్టహాసంగా కన్నుల పండువగా నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల ముగింపు రోజు పట్టాభిరాముడిని అశ్వవాహనంపై పార్వేట మండపం వద్దకు ఊరేగింపుగా తీసుకెళతారు. ఏడాదికి ఒక్కసారి పట్టాభిరాముడు పార్వేట మండపానికి వేంచేస్తారు. కానీ పురాతనమైన మండపం శిథిలావస్థకు చేరింది. పైకప్పుపై మట్టి ఉండటంతో గడ్డి, పిచ్చిమొక్కలు మొలిచాయి. ఇప్పటికైనా టీటీడీ అధికారులు స్పందించి పార్వేట మండపాన్ని మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కల్యాణ వేదిక స్థలాలను పరిశీలించి శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం. స్థానికుల అభిప్రాయాల మేరకు టీటీడీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. అలాగే పట్టాభిరామాలయ పార్వేట మండపాన్ని పునరుద్ధరించే దిశగా ఉన్నతాధికారులతో చర్చిస్తాం. సమస్యలన్నింటినీ పరిష్కరించేలా చూస్తాం.

-కృష్ణమూర్తి, ఈవో, పట్టాభిరామాలయం, వాల్మీకిపురం

నీటి విషయమై మామ,అల్లుళ్లపై దాడి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 6: గొర్రెల సంతలో గొర్రెలకు నీరుతాపే విషయమై ఓ వ్యక్తి మామ, అల్లుళ్లపై దాడి చేశాడు. కదిరికి చెందిన అంబరీష్(30, అతని మామ వెంకటమల్లు(60)శనివారం కురబలకోట మండలం అంగళ్లులో జరిగే గొర్రెల సంతకు గొర్రెలను తోలుకొచ్చారు. ఈ క్రమంలో సంతపక్కన నీటితొట్టిలో గొర్రెలకు నీరు తాపే విషయమై కదిరి నుంచి వచ్చిన బావాజాన్ వారిద్దరితో గొడవపడ్డాడు. వారి మధ్య జరిగిన ఘర్షణలో గాయపడిన అంబరీష్, వెంకటమల్లు మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ముదివేడు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

కిరణ్‌కుమార్‌రెడ్డికి సంపూర్ణ మద్దతు ఇస్తాం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 6: రాజంపేట పార్ల మెంట్ బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్య ర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలుపునకు సంపూ ర్ణ మద్దతు ఇస్తామని మాజీ ఎమ్మెల్యే రాట కొండ శోభ, బాబురెడ్డి దంపతులు పేర్కొన్నా రు. శనివారం మదనపల్లె పర్యటనకు వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డి శాస్త్రీవీధిలోని బాబురెడ్డి నివా సానికి వెళ్లారు. ఈ సందర్భంగా బాబురెడ్డి మా ట్లాడుతూ కిరణ్‌కుమార్‌రెడ్డిని ఎన్నికల్లో కష్టపడి గెలిపించుకుంటామన్నారు. అలాగే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలోని ఏడు అసెంబ్లీ స్థానాల అభ్యర్థుల గెలుపునకు శక్తివంచనా లేకుండా పనిచేస్తామన్నారు. తెలుగు యువ త నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గురుప్రసాద్, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే కమ్మవీధిలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డికి రాయల సీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్‌చౌదరి ఘనస్వాగతం పలికారు. రాజంపేట ఎంపీ స్థానం, ఏడు నియోజకవర్గాల ఉమ్మడి కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జంగాల శివరామ్, అడపా సురేంద్ర, సనాఉల్లా, రెడ్డెప్ప, లక్ష్మీపతి, కె.రెడ్డెమ్మ, నాగవేణి, పద్మావతి పాల్గొన్నారు.



కిరణ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న బాబురెడ్డి

రామసముద్రంలో: మదనపల్లికి విచ్చేసిన మాజీ ముఖ్యమంత్రి, రాజంపేట పార్లమెంట్ కూటమి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని మండల జనసేన నాయకులు రాయలసీమ కో కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి నివాసంలో మర్యాదపూర్వంగా కలిశారు. వారిలో రామసముద్రం మండల జనసేన మండల అధ్యక్షుడు హోసూర్ చంద్రశేఖర్, చిత్తూరు జిల్లా జాయింట్ సెక్రటరీ సనావుల్లా, ఉపాధ్యక్షులు విశ్వనాథ్, గడ్డం లక్ష్మీపతి, జనసేన మండల నాయకులు ఉన్నారు. మదనపల్లె నియోజకవర్గ అభ్యర్థి షాజహాన్‌బాషాను, తనను ఎన్నికల్లో గెలిపించాలని కోరినట్లు జనసేన నాయకులు తెలిపారు.

దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వమే..

పీలేరు, ఏప్రిల్ 6: దేశంలో మూడవసారి బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం తథ్యమని ఆ పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు బి.చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా రాజంపేట పార్లమెంటుకు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు బీజేపీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. బీజేపీ ఆవిష్కరణ దినోత్సవం సందర్భంగా శనివారం బీజేపీ నాయకులు పట్టణంలో ప్రదర్శన నిర్వహించగా చంద్రశేఖర్ రెడ్డి జెండా ఊపి ప్రదర్శన ప్రారంభించారు. కార్యక్రమంలో పీలేరు అసెంబ్లీ కన్వీనరు పొత్తూరి శ్రీకాంత్, కోకన్వీనరు రమణ, జిల్లా కార్యదర్శి గుణశేఖర్, మండల బీజేపీ అధ్యక్షుడు మహదేవ నాయుడు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ధనాంజనేయులు, వెంకటాద్రి, చిన్నయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



పీలేరు పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

నామినేషన్ పత్రాల్లో తప్పులు లేకుండా చూసుకోవాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల పత్రాలను రాజకీయ పార్టీ నాయకులు ఎలాంటి తప్పులు దొర్లకుండా పూర్తి చేసి సమర్పించాలని రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో హరిప్రసాద్ సూచించారు. శనివారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 17వ తేదీ వరకు 18 ఏళ్లు నిండిన వారందరు ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, దీనిపై పలు కళాశాలలకు వెళ్లి స్వీప్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రచారం చేసే రాజకీయ పార్టీలు 48 గంటల ముందుగానే అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం తహసీల్దార్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం, ఏప్రిల్ 6: ఓటుకు అర్హత కలిగిన యువతీ యువకులు ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని వాల్మీకిపురం తహసీల్దార్ ఖాతీజున్‌ఖుబ్రా పేర్కొన్నారు. శనివారం వాల్మీకిపురంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు హక్కు అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు ప్లకార్డులు, బ్యానర్లు చేతబట్టి పురవీధుల గుండా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది ఓటు అని ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థ కోసం ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, ఎస్ఐ నాగేశ్వర్‌రావ్, వివిధ శాఖల అధికారులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటుపుస్తకాలు వితరణ

నిమ్మనపల్లి, ఏప్రిల్ 6: మండలంలోని రాచవేటివారిపల్లి ప్రాథమికోతన్నత పాఠశాలలో దీపిక, మహేష్‌లు తమ కుమార్తె కుష్మశ్రీ జయదేత్ పుట్టినరోజు సందర్భంగా 138మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి మంచి మార్కులతో సాధించి తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయరామిరెడ్డి, ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 6: తంబళ్లపల్లె, వాల్మీకిపురం మండలాల్లో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు గాయపడ్డారు. శనివారం తంబళ్లపల్లె మండలం పరశతోపు గ్రామానికి చెందిన నరసింహులు భార్య రమణమ్మ(60) గ్రామంలో నడుచుకుని వెళుతుండగా అదే గ్రామానికి చెందిన యువకుడు ద్విచక్రవాహనంలో వేగంగా వచ్చి ఢీకొనడంతో ఆమె గాయాలపాలైంది. చికిత్స కోసం మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అలాగే వాల్మీకిపురంకు చెందిన రాజశేఖర్(40) జీపు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం పెద్దమండ్యం వైపు వెళుతుండగా అదుపు తప్పిన జీపు రోడ్డుపక్కన చెట్టును ఢీ కొనింది. దీంతో తలకు తీవ్రగాయమైన రాజశేఖర్‌ను మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

నాటు సారా స్వాధీనం.. మహిళ అరెస్టు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 6: నాటుసారా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్టు చేసి నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు మదనపల్లె రూరల్ సీఐ శేఖర్ తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె పట్టణం నక్కలదిన్నె తాండాకు చెందిన బుడ్డమ్మ(55) ఇంటి వద్ద నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో రూరల్ పోలీసులు తమ సిబ్బంది కలిసి వెళ్లి 13 లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్టు చేసినట్లు సీఐ శేఖర్ తెలిపారు.

సంక్షేమ పథకాల అమలు కూటమితోనే సాధ్యం

కలకడ, ఏప్రిల్ 6:రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే సాధ్యమని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన నాయకులతో కలిసి బాలయ్యగారిపల్లె పంచాయతీలోని ఎర్రయ్యగారిపల్లె ఎస్టీ కాలనీ, నల్లగుట్టపల్లె, అచ్చారవాండ్లపల్లెలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింట కరపత్రాలను పంపిణీ చేసి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. బీసీల కోసం రక్షణ చట్టాన్ని తీసుకొచ్చి అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించారు. పీలేరు నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలు ఎమ్మెల్యే, ఎంపీ కూటమి అభ్యర్థులకు మద్దతు పలకాలని కోరారు. మహిళ ఆర్థికాభివృద్ధి కోసం శ్రమించే చంద్రబాబునాయుడుని సీఎంగా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లారపు రవిప్రకాశ్, మద్దిపట్ల సూర్యప్రకాశ్, బరకం శ్రీనివాసులరెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, ప్రభాకర్‌నాయుడు, తిరుపతినాయుడు, వెంకటరమణనాయుడు, బీవీస్వామి, కాంతారావు, నాగరాజునాయుడు, మల్లికార్జున్‌నాయుడు, విశ్వనాథ్, రవింద్రరెడ్డి, ప్రసాద్, ఈశ్వరయ్య, రాజకోటేశ్వర, మెకానిక్ ఈశ్వర, రెడ్డప్ప, వెంకటరమణలు పాల్గొన్నారు.



సూపర్ సిక్స్ పథకాలను మహిళలకు వివరిస్తున్న కిశోర్‌కుమార్‌రెడ్డి

కష్టపడిన వారికి టీడీపీలో గుర్తింపు ఉంటుంది

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 6: టీడీపీ బలోపేతానికి, పార్టీ గెలుపునకు కష్టపడుతున్న ప్రతి ఒక్కరికి పార్టీ తగిన గుర్తింపు ఇస్తుందని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఒకటో వార్డు, అనపగుట్ట ప్రాంతాల్లో షాజహాన్‌బాషా ప్రజాగళం పేరిట ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ కార్యక్రమాలు, సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి వస్తానే అనపగుట్ట ప్రాంతాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం టీడీపీ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ యర్రబల్లి వెంకటరమణారెడ్డితోపాటు ఇదే వార్డులో చేనేత కార్మికులను కలసిన షాజహాన్‌బాషా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ కొడవలి శివప్రసాద్, ఎస్ఏ మస్తాన్, దొరస్వామినాయుడు, మల్లికార్జుననాయుడు, ఎం.నాగయ్య, మహబూబ్‌ఖాన్, జేసీబీ ఈశ్వరనాయుడు, మదుసూధన్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



షాజహాన్‌బాషాను సత్కరిస్తున్న టీడీపీ మీడియా కోఆర్డినేటర్ వెంకటరమణారెడ్డి

ఆదరించండి..అండగా ఉంటా : షాజహాన్‌బాషా

రామసముద్రం, ఏప్రిల్ 6: ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా తనను ఆదరించి గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉంటూ అండగా ఉంటానని మదనపల్లె నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా అన్నారు. మండలంలోని చెంబకూరు, కమ్మవారిపల్లె పంచాయతీలలో శనివారం ఆయన పర్యటించి మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తుకు టీడీపీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని టీడీపీ శ్రేణులను కోరారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో చలపతినాయుడు, తిప్పన్న, పెంచుపాడు స్వామి, వెంకటరమణ, టేకుపల్లె రమణ, రామకృష్ణ, జనసేన మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, సనాఉల్లా, విశ్వనాథ్, క్రాంతి బంగారప్ప, గౌతమ్, బీజేపీ కృష్ణమూర్తి, దళితవాడ నాగరాజ, శంకర, రవి, కాప్పల్లి భాస్కర్‌రెడ్డి, పూలగుండ్లపల్లి శ్రీనివాసులు, నడింపల్లి రమేష్, జావీద్, రహంతుల్లా, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి.. సంక్షేమం

● ఏప్రిల్ నుంచి అవ్వాతాతలకు రూ.4వేలు పెన్షన్

● తంబళ్లపల్లె ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 6: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోనేటివారిపల్లె పంచాయతీ ఏసువారిపల్లె, కోనేటివారిపల్లె, ఏడుమడకలపల్లె, రాయపువారిపల్లె, రామాకులపల్లె, తంబళ్లవారిపల్లె, సోంపాళ్యం తదితర గ్రామాల్లో బాబు ష్యూరిటీ .. భవిష్యత్తు గ్యారంటీ పథకాలు, విజయ సంకల్ప ప్రచార యాత్రలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే ఏప్రిల్ నెల నుంచే పెన్షన్ లబ్ధిదారులకు రూ.4వేలు పెన్షన్‌ను నేరుగా ఇంటి వద్దకే వచ్చి అందిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించారన్నారు. ఒక్క అవకాశమిస్తే తంబళ్లపల్లె నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపి స్తానన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, జనసేన ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు కువైట్ శంకర్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, మాజీ సర్పంచ్ యర్రగుడి సురేష్, నేతలు కేవీ రమణ, నాయకులు ఉమాశంకర్, ప్రతాప్, రమణారెడ్డి, పాలరాము, వెంకటసిద్ధయ్య, శివన్న, మెకానిక్ హరి, సోమశేఖర్, శివ, ఆంజనేయరెడ్డి, రంగాళ్ళ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఏడుమడకలపల్లెలో గ్రామస్థులతో ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డి

టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిని ఆదరించండి

తంబళ్లపల్లె, ఏప్రిల్ 6: ఎన్నికల్లో టీడీపీ, జనసేన బీజేపీలను ఆదరించి.. గెలిపించాలని తంబళ్లపల్లె టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు మండలంలోని రేణుమాకులపల్లె పంచాయతీ బండార్లపల్లె, తిమ్మయ్యఇండ్లులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు శంఖారావం సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను అందజేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాల గురించి వివరించారు. ఎన్నికల్లో కూటమికి ఓటేసి సీఎంగా చంద్రబాబును, ఎమ్మెల్యేగా జయచంద్రారెడ్డిని, ఎంపీగా కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బేరిశీన, యూనిట్ ఇన్‌చార్జ్ బీఎంఆర్ రెడ్డప్ప, సుధాకర్, రాధశెట్టి, సుబ్రమణ్యం, ఈశ్వర్‌రెడ్డి, మధవరెడ్డి, శ్రీనివాసులు, బాలకృష్ణారెడ్డి, పద్మావతమ్మ, గణేష్, పుల్లారెడ్డి టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.



సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు

ఆత్మీయ సమ్మేళన సభకు తరలిరండి

● పారిశ్రామిక వేత్త కొండా నరేంద్ర

బి.కొత్తకోట, ఏప్రిల్6: బి. కొత్తకోట పట్టణంలోని కొండా ఎస్టేట్‌లో ఆదివారం భారీస్థాయిలో నిర్వహించనున్న ఆత్మీయ సమ్మేళన సభకు తరలిరావాలని బి. కొత్తకోటకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండానరేంద్ర పేర్కొన్నారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ తమను తాము పరిపాలించుకునే విధంగా రైతులు, యువత, కార్యకర్తలు, అభిమానులు అందరూ కలిసి చర్చించుకు నేందుకు ఈ ఆత్మీయ సభను నిర్విహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండ లాల నుంచి పెద్దసంఖ్యలో అందరూ తరలి రావాలని నరేంద్ర కోరారు. తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని కలిసిన నరేంద్ర ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తుండటం రా.కీయ ప్రాధాన్యం సంతరించుకుంది.



వాల్మీకి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 6: అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలం కొనకొండ గ్రామంలో వాల్మీకి విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని ఏపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుల్లి శీనివాసులు పేర్కొన్నారు. స్థానిక వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి విగహాన్ని ధ్వంసం చేసిన దుండగలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సనాతన దర్మాన్ని కాపాడాలని ఆయన కోరారు. అరాచక శక్తులను శిక్షించి హిందూ మతాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సద్దల జయసింహా,నరసింహులు, నారాయణ, సహదేవ, నాగరాజు, అరవ నిర్మలమ్మ, రామప్ప, వెంకటరమణ, రాజు, సాంబ, దేవా పాల్గొన్నారు.



వాల్మీకి విగ్రహం వద్ద నిరసన చేస్తున్న ఏపీవాల్మీకి సంఘం నాయకులు